క్లుప్తంగా

ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరును రద్దు చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: పారిశుధ్య కార్మికులకు ఎఫ్‌ఆర్‌ఎస్ (ముఖచిత్రం) హాజరు పద్ధతిని రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం స్థానిక ఆర్‌జేడీ కార్యాలయాన్ని ముట్టడించారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ కార్మికులలో ఎక్కువగా నిరక్షరాస్యులు, స్మార్ట్ ఫోన్ వినియోగించని వారు ఉన్నారన్నారు. ఎఫ్ ఆర్‌ఎస్ రద్దు చేసేవరకూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. రాష్ట్ర కోశాధికారి బీవీవీ కొండలరావు, నెక్కింటి సుబ్బారావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు పాల్గొన్నారు.

అలరించిన 'మళ్లీ మళ్లీ పాడాలి'



పట్నాల శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ/ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పట్నాల వెంకట సుబ్బమ్మ మెమోరియల్ ట్రస్టు చైర్మన్ పట్నాల శ్రీనివాస్ సారథ్యంలో, సింగర్ దీపిక ఆధ్వర్యంలో స్థానిక విక్రమహాల్లో బుధవారం జరిగిన మళ్లీ మళ్లీ పాడాలి స్వర నీరాజనం సంగీత విభావరి అలరించింది. ముఖ్య అతిథులుగా హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు పట్నాల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ ఏవీ రమణ, గాయకుడు బర్రే సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. గాయకులు పట్నాల శ్రీనివాస్, దీపిక, ఆదర్శ, ఫణి కుమార్, రాధ, సుభాష్ పాటలు పాడి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. అనంతరం లక్కీడిప్ ద్వారా ప్రేక్షకులకు పలు బహుమతులు అందజేశారు.

మద్యం స్వాధీనం - ఒకరి అరెస్టు



మద్యం బాటిళ్లు, నిందితురాలితో నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రమణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక పేపరుమిల్లు ఎదురుగా శ్రీరామ్‌నగర్‌లో అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న సమాచారంపై బుధవారం టెక్నికల్ వింగ్ ఎస్సై, నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్, ఎస్సై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా చెల్లూరి వెంకటలక్ష్మిని అరెస్టు చేసి, 40 క్వార్టర్ బాటిళ్లు, 18 బీర్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆమెను రిమాండ్‌కు తరలించామని నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. మద్యం తయారు చేసినా, రవాణా చేసినా, అక్రమంగా కలిగిఉన్నా 91777 44055 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమం



కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

ప్రకాశం నగర్: పేపర్ మిల్లు యాజమాన్యం నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ అన్నారు. కార్మికులు దీక్షలు బుధవారం 29వ రోజుకు చేరాయి. రిలే దీక్ష శిబిరాన్ని రవీంద్రనాథ్ సందర్శించి కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల కడుపుకొట్టి కొందరు జేబులు నింపుకొంటున్న పరంపర 2ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతన ఒప్పందాన్ని అమలు చేసి, క్యాంటీన్ రేట్లు తగ్గించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు తాటిపాక మధు, కె.రాంబాబు, వి.కొండలరావు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్సుల జారీపై సదస్సు

కంబాలచెరువు: డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల జారీలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారంపై న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ ప్రజల్లో మార్పుతోనే రోడ్డు ప్రమాదాలను తగ్గించగలమన్నారు. 18 ఏళ్లు దాటని పిల్లలకు వాహనాలు ఇవ్వడం పెద్దవాళ్ల తప్పే అవుతుందన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అవసరమైన పత్రాలతో వాహనాలు నడపడం వల్ల అనేక సమస్యలు నివారించవచ్చన్నారు. అనంతరం ట్రాన్స్‌పోర్ట్ అధికారులు, ట్రాఫిక్ పోలీసు అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్చలు జరిగాయి. కార్యక్రమంలో జిల్లా డీటీవో కేఎస్ఎంవీ కృష్ణారావు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీటీవో అశోక ప్రతాపరావు, డీఎస్పీ కేవీఎస్‌వీ ప్రసాద్, జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సబిత, ఎఎస్ఆర్ జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.ఆనందరావు పాల్గొన్నారు.

వ్యాయామం.. ఆరోగ్యానికి ఔషధం

- ప్రజలకు ఆసక్తి పెంచేందుకు ఎయిర్ జిమ్
- జేగురుపాడులో ఏర్పాటు
- త్వరలో ప్రారంభోత్సవం



జేగురుపాడులోని ఓపెన్ ఎయిర్‌జిమ్‌లో విద్యార్థులు

కడియం: ప్రస్తుత ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరు శారీరక శ్రమపై దృష్టి పెడుతున్నారు. అందుకు అనుగుణంగా అందుబాటులో ఉన్న వివిధ పద్ధతుల ద్వారా వ్యాయామాలు చేస్తున్నారు. పట్టణ ప్రాంత ప్రజలకు జిమ్, యోగా, స్విమ్మింగ్ తదితర పలు రకాలైన వ్యాయామ సదుపాయాలు ఎప్పట్నుంచో అందుబాటులో ఉన్నాయి. అయితే పల్లె ప్రాంత ప్రజలకు, అందులోనూ ఉచితంగా ఈ సేవలను ఎక్కడా లేవనే చెప్పాలి. ముఖ్యంగా రూరల్ నియోజకవర్గంలో పూర్తిస్థాయి వ్యాయామ పరికరాలతో ఓపెన్ ఎయిర్‌జిమ్ కడియం మండలం జేగురుపాడు గ్రామంలో అందుబాటులోకి వచ్చింది. గ్రామాభివృద్ధిలో తోటివారికి స్ఫూర్తిగా ఉండడంలో సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ నేతృత్వంలో గ్రామం ఎప్పుడూ ముందే ఉంటుంది. ఇదే క్రమంలోనే ఓపెన్ ఎయిర్ జిమ్‌ను ఇప్పుడు ఇక్కడ ఏర్పాటు చేశారు.

సుమారు ఎకరం విస్తీర్ణంలో..

జేగురుపాడు ముఖద్వారం వద్ద ఉన్న సుమారు ఎకరం విస్తీర్ణ గల ప్రభుత్వ పోరంబోకు స్థలాన్ని పార్కుగా రూపుదిద్దారు. టైల్స్, మొక్కలు, చుట్టూ ఫెన్సింగ్‌ను పంచాయతీ నిధులతో ఏర్పాటు చేశారు. అందులో ఇదే గ్రామ పరిధిలోని రామదాసు పేపర్‌బోర్డ్స్ సంస్థ సుమారు నాలుగు లక్షల రూపాయలు వెచ్చించి, నాసిక్ నుంచి ఆధునిక



జిమ్‌లో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు

వ్యాయామ పరికరాలను తీసుకువచ్చి పంచాయతీకి అందజేసింది. వీటిని ఈ పార్కులో బిగించారు. తెల్లవారుజాము, రాత్రి 11 గంటల వరకు వినియోగించుకునేందుకు వీలుగా ఈ ఓపెన్ ఎయిర్ జిమ్ చుట్టూ విద్యుద్దీపాలను కూడా ఏర్పాటు చేశారు. వాకింగ్ ట్రాక్‌తో పాటు, ఇరవై రకాల వ్యాయామాలు చేసుకునేందుకు వీలుగా పరికరాలను సిద్ధం చేశారు. దీంతో ఇది పూర్తిస్థాయిలో తమకు ఉపయోగపడుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యాయామ పరికరాలతో పాటు, చిన్న పిల్లలకు ఆసక్తి పెంచే ఉయ్యాల తదితర పరికరాలను కూడా ఉంచారు.

ఆరోగ్యకర జీవనం



ప్రస్తుతం యువత వ్యాయామంపై దృష్టి పెట్టడం లేదు. పైగా చెడు వ్యసనాలకు ఆకర్షితులవుతున్నారు. కళ్లెదుటే పరికరాలు ఉంటే వ్యాయామం చేయడానికి ఆసక్తి పెరుగుతుంది. దీంతో ఎక్కడా లేనివిధంగా ఓపెన్‌ఎయిర్ జిమ్ ఏర్పాటు చేయాలన్న ఆలోచన వచ్చింది. రామదాసు సంస్థ కూడా ముందుకు రావడంతో నాసిక్ నుంచి పరికరాలను ప్రత్యేకంగా తీసుకువచ్చి ఏర్పాటు చేశారు. ఆరోగ్యకరమైన జీవనశైలికి వ్యాయామం అవసరాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్న ఉద్దేశంతోనే గ్రామ ముఖద్వారంలోనే ఈ జిమ్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. పార్కును ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఇటీవలే ప్రారంభించాం. జిమ్ పరికరాలను కూడా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, సర్పంచ్, జేగురుపాడు

చంద్రబాబును చరిత్ర ఎన్నటికీ క్షమించదు

- నిరాధార ఆరోపణలు మానుకోవాలి
- వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ ఆరిఫ్



సమావేశంలో మాట్లాడుతున్న మహ్మద్ ఆరిఫ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజలు ఇక తనను నమ్మరని గ్రహించిన చంద్రబాబు ప్యాకేజీ స్టార్లనే నమ్ముకున్నారని, ఈ క్రమంలో ఒక్కొక్క సామాజిక వర్గం నుంచి ఒక్కొక్క ప్యాకేజీ స్టార్‌ను తయారు చేస్తున్నారని జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ మహమ్మద్ అరిఫ్ ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ నగర అధికార ప్రతినిధి హబీబుల్లా ఖాన్, ముస్లిం నాయకులతో కలిసి బుధవారం బిలాల్ ఫంక్షన్ హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరిఫ్ మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఎన్నికలకు ఆరు నెలల ముందు గుర్తుకు వచ్చే ముస్లిం సామాజిక వర్గం.. ఇప్పుడు ఆయన ప్రతిపక్షంలో ఉండగా ఏడాది ముందు గుర్తుకు రావడం చాలా సంతోషమని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో మైనారిటీలను వంచించిన తీరుపై ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై, రాష్ట్ర ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో హామీలను అమలు చేయాలన్న అమాయక ముస్లిం యువకులపై దేశద్రోహం కేసులు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. గుంటూరు జిల్లా దాచేపల్లిలో మైనారిటీ బాలికపై అత్యాచారాన్ని నిరసిస్తూ న్యాయం చేయాలని రోడ్డెక్కిన ముస్లింలపై హత్యాయత్నం కేసు నమోదు చేయడాన్ని రాష్ట్ర ముస్లిం సమాజం ఎన్నటికీ మరువదన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డులో తన డైరెక్టర్ల ద్వారా కోర్టు కేసులు వేయించి బోర్డు ఏర్పాటు అవ్వకుండా కుట్రలు చేయడమే కాకుండా ఆధారం లేని ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వక్ఫ్ బోర్డులో జరిగిన అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధం కావాలంటూ సవాల్ విసిరారు. తన కొడుకును ప్రజాక్షేత్రంలో గెలిపించుకోలేని చంద్రబాబు..అబ్దుల్ కలాంను రాష్ట్రపతిని చేశాననడం హాస్యాస్పదమన్నారు. నగర అధికార ప్రతినిధి హబీబుల్లాఖాన్ మాట్లాడుతూ మొన్నటికి మొన్న జైలులో పరామర్శకు వెళ్లినప్పుడు సీనియర్ మైనారిటీ నాయకుడు మాజీ ఎమ్మెల్సీ షరీఫ్‌ను అవమానకరంగా బయట నిలబెట్టడమే కాకుండా, నూర్ భాషాల ఆత్మీయ సమావేశంలో టోపీ పెట్టుకోవడానికి తిరస్కరించిన తీరుపై ముస్లింలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో షేక్ నిజాం, షేక్ చానా, ఆరిఫుల్ల ఖాన్, సయ్యద్ మదిని, గౌస్ రఫీ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వరి పొలాన్ని పరిశీలిస్తున్న జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ బోసుబాబు

రాజమహేంద్రవరం రూరల్: రైతులు వరి పొలాల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ వి.బోసుబాబు అన్నారు. వరి పంటపై కాండం తొలుచు, ఆకుముడత పురుగులు అక్కడక్కడా వ్యాపించాయన్నారు. బుధవారం రాజవోలు గ్రామంలో వరిపొలాలను వ్యవసాయ శాఖాధికారులతో డీడీఏ సందర్శించారు. కాండం తొలుచు పురుగు నివారణకు వేపనూనె ద్రావణం పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుతం వరిపంట పిలక దశలో ఉందని, రైతులు ప్రతిరోజు పొలాన్ని సందర్శించి వ్యవసాయ సహాయకుల సూచనలు పాటించాలన్నారు. పొలంబడిని రైతులందరూ ఉపయోగించుకుని, తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు పొందాలన్నారు. మండల వ్యవసాయాధికారి భీమరాజు, వ్యవసాయ విస్తరణాధికారి పీటర్, వీఏఏ దుర్గబాబు, రైతులు మెర్ల సూర్యనారాయణ, చిట్టిబాబు, రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

అమృతకాలానికి పునాది కేంద్ర బడ్జెట్



సమావేశంలో మాట్లాడుతున్న యామినీ శర్మ

రాజమహేంద్రవరం సిటీ: దేశంలో ఆయా రంగాల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం బడ్జెట్ ప్రవేశ పెట్టిందని ప్రముఖ పారిశ్రామికవేత్త, బడ్జెట్ విశ్లేషకురాలు సామినేని యామినీ శర్మ అన్నారు. బుధవారం బీజేపీ తూర్పు గోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక గౌతమ ఘాట్ చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ భవనంలో 2023 – 24 ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే 25 ఏళ్ల అమృత కాలానికి ఈ బడ్జెట్ పునాది వంటిదన్నారు. రక్షణ రంగం మొదలుకుని చేతి వృత్తుల వరకూ అందరికీ ప్రయోజనం కలిగేలా ఈ బడ్జెట్ ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా ఆలోచించి, బడ్జెట్‌ను సానుకూల దృక్పథంతో చూడాలన్నారు. కార్యక్రమంలో రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ జవ్వార్, ట్రెజరర్ బలభద్ర రాజా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు పాల్గొన్నారు.

డ్రగ్‌ఫ్రీ ఆంధ్రప్రదేశ్ సాకారానికి కృషి



మాట్లాడుతున్న ఎస్ఈబీ నార్త్ ఇన్‌స్పెక్టర్ రమణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్ర ప్రభుత్వం ఆశయం 'డ్రగ్‌ఫ్రీ ఆంధ్రప్రదేశ్' సాకారానికి విద్యార్థులు కృషి చేయాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల వచ్చే ఆరోగ్య, మానసిక, సామాజిక సమస్యలను వివరించారు. మత్తు పదార్థాల అమ్మకం, కొనుగోలు వంటి విషయాలు జరిగితే టోల్‌ఫ్రీ నంబర్ 14500కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్సై మహేష్, కళాశాల ప్రిన్సిపాల్ ఫణి కుమార్ పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరానికి చెందిన బూలా గౌతమ్ (20) బుధవారం ఉదయం ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై కె.శుభశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్యానికి బానిసైన గౌతమ్ తరచూ ఇంటి వద్ద ఘర్షణ పడుతుంటాడు. ఈ నేపథ్యంలో మంగళవారం మద్యం తగి ఇంటికి రావడంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన గౌతమ్ తెల్లవారుజామున ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లి స్వరాజ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సమావేశం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగర పాలకసంస్థ పరిధిలోనిని రూరల్ నియోజకవర్గానికి చెందిన 8వ డివిజన్లలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ఇన్‌చార్జుల సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు రైల్వేస్టేషన్ సమీపంలోని మున్సిపల్ కల్యాణ మండపంలో జరుగుతుంది. ఈ మేరకు వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ బుధవారం ప్రకటన విడుదల చేశారు.

తోకాడలో వైద్య శిబిరం

రాజానగరం: మండలంలోని తోకాడలో నెడ్‌క్యాప్ డైరెక్టర్ గండి నానిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు గండి వెంకట సుజాత ఆధ్వర్యంలో అనపర్తికి చెందిన రమాదేవి ఆస్పత్రి సహకారంతో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి కూడా ఉచితంగా చేసేందుకు ఏర్పాట్లు చేశారు. సర్పంచ్ వేగిశెట్టి వీవీ చక్రధరరావు శిబిరాన్ని పర్యవేక్షించారు.

వృద్ధుడిపై దాడి

సీతానగరం: గ్రామానికి చెందిన 70 ఏళ్ల తవిటికి తాతయ్యలుపై దాడి చేసిన తవిటికి విద్యాసాగర్, బాలాజీపై కేసు నమోదు చేశామని ఎస్సై కె.శుభశేఖర్ బుధవారం తెలిపారు. తాతయ్యలు ఇంటి దగ్గరలో వాలీబాల్ కోర్టు ఉంది. అందులో కొందరు యువకులు ఘర్షణ పడుతుండటంతో ఎందుకు గొడవపడుతున్నారని తాతయ్యలు అడిగాడు. దీంతో అతడి తలపై విద్యాసాగర్, బాలాజీ కొట్టడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆంజనేయస్వామి గ్రామోత్సవం

రంగంపేట: మెళ్లూరులోని ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారి మేలు కొలుపుతో కార్యక్రమాలు ప్రారంభించారు. పంచామృతాభిషేకం, తమలపాకుల పూజ నిర్వహించి స్వామివారి ని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దూలం నాగేశ్వరరావు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రచార రథానికి స్వాగతం

సీతానగరం: మండలంలోని రాపాక గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారి సనాతన హిందూధర్మ ప్రచార రథానికి భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. వీధుల్లో పసుపు నీరు చల్లుతూ గోవింద నామస్మరణ చేశారు. మంగళవారం రాత్రి రాపాకలోని సీతారామస్వామి ఆలయం వద్దకు ప్రచార రథం చేరుకుంది. అన్నమాచార్య సంకీర్తనతో జోపాటతో శ్రీవారిని నిద్రపుచ్చి, బుధవారం ఉదయం మేళతాళాలు, కోలాట నృత్యాలు, భజన బృందాలతో రథయాత్ర కొనసాగింది.

పేదల ఇళ్లలో సంక్షేమ వెలుగులు



తొర్రేడులో ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- తొర్రేడులో గడప గడపకూ మన ప్రభుత్వం

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేద, మధ్యతరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు విరబూస్తున్నాయని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. తొర్రేడు గ్రామ సచివాలయం–1 పరిధిలో రెండోరోజు బుధవారం సాయంత్రం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చందన నాగేశ్వర్ పార్టీ శ్రేణులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి 350 కుటుంబాలకు కలిశారు. వారిని ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం అందించిన పథకాలను వివరిస్తూ బుక్‌లెట్లు అందజేశారు. సీఎం జగనన్న ఇంటి వద్దకే పథకాలు అందిస్తున్నారని పింఛన్ అందుకుంటున్న వృద్ధులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని చందన నాగేశ్వర్ చెప్పగా.. తమ ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నామని, కొన్ని ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగడం లేదన్నారు. వెంటనే పంచాయతీ కార్యదర్శి సీతాపతిని వీధిదీపాలు సమస్యలను పరిష్కరించాలని చందన నాగేశ్వర్ ఆదేశించారు. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం త్వరితగతిన చేపడతామన్నారు. సీఎం జగన్‌ను ఆదర్శంగా తీసుకుని దేశంలో మిగిలిన రాష్ట్రాల ముఖ్యమంత్రులు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉప్పులూరి రాంబాబు (రాము), సొసైటీ అధ్యక్షులు చిట్టూరి వెంకటరావు, సభ్యులు దండమూడి అర్జునరావు, గద్దె సుబ్బారావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కొత్తపల్లి కేశవ రామారావు, దాసరి గోపాలకృష్ణ, మిరియం నెహ్రూ, మెప్పెల్లి రాజు, మంగం శేఖర్ బాబు, బోదదాసి రాహుల్, గద్దె శ్రీనివాస్ చౌదరి, చిట్టూరి సత్యనారాయణ, బొల్లిన రామకృష్ణ, రెడ్డి చంటి, పాలడుగుల శ్రీధర్, షేక్ గౌసియా బేగం, పోలిన శ్రీను, పాత్రగడ వెంకట్రావు, అలీ సలార్ పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా ఫార్మేటివ్ పరీక్షలు



ఉపాధ్యాయులకు ఓఎంఆర్ షీట్లు అందజేస్తున్న డీఐ దిలీప్‌కుమార్

కంబాలచెరువు: అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో జరుగుతున్న ఫార్మేటివ్ 3 పరీక్షలను ప్రభుత్వ నియమావళిని అనుసరించి నిర్వహించాలని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. పరీక్షలు సీబీఏ విధానంలో జరుగుతున్న కారణంగా ఓఎంఆర్ షీట్‌లను విద్యార్థులు జాగ్రత్తగా పూర్తి చేసేలా చూడాలన్నారు. ఈ పరీక్షకు ఓఎంఆర్ షీట్లపై విద్యార్థుల వివరాలు ముద్రించి ఇవ్వడం జరిగిందని, బండిల్స్ అందజేసేటప్పుడు వాటిని సీరియల్ ప్రకారం పెట్టి ఇవ్వాలన్నారు. పర్యవేక్షణకు అధికారులు వచ్చి గూగుల్ ఫారంలో సమాచారాన్ని పూర్తి చేయాలని, ప్రధానోపాధ్యాయుల వద్ద ఆ సమాచారం అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి రోజూ పరీక్షకు గంట ముందుగా ప్రశ్నపత్రాల బండిల్స్‌ను ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాల స్టోరేజ్ పాయింట్ నుంచి ప్రధానోపాధ్యాయులకు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, పట్నీడి ప్రసాద్, కుమారి, ఇందిర, కోటేశ్వరి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



డీఎంహెచ్ స్కూల్‌ను పరిశీలిస్తున్న జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ గౌరీశంకర్

కంబాలచెరువు: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని, విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డి.గౌరీశంకర్ అన్నారు. స్థానిక దానవాయిపేట నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. విద్యార్థులు రాస్తున్న ఫార్మేటివ్ 3 పరీక్షలను పరిశీలించారు. విద్యార్థులు పదికి పది పాయింట్లు సాధించడమే లక్ష్యంగా చదవాలన్నారు. 10వ తరగతి విద్యార్థులకు 60 రోజుల ప్రత్యేక ప్రణాళికను అనుసరించి ఉపాధ్యాయులందరూ ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. సి, డి గ్రేడు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారికి మాదిరి ప్రశ్న పత్రాలను అర్థమయ్యేలా వివరించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం జరిపి సూచనలు చేశారు. ప్రధానోపాధ్యాయులు కూడా ప్రత్యేక తరగతులు పర్యవేక్షిస్తూ సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.రాజా ప్రశాంత్, సీఆర్పీ జయంతి శాస్త్రి పాల్గొన్నారు.

గుడ్‌కేర్ సొసైటీ సేవలు అభినందనీయం

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి వితరణ



మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: గుడ్‌కేర్ హెల్పింగ్ సొసైటీ సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. ఆ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం శాటిలైట్‌సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 300 మంది పదోతరగతి విద్యార్థులకు అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు, పరీక్ష వస్తువుల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సొసైటీ ఫౌండర్, ట్రస్టీ కావూరి వరలక్ష్మి, లీగల్ అడ్వైజర్ కావూరి సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఏడాది పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్నామన్నారు. కొయ్యానకు మారి, ప్రసాద్, చిట్టిబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగులో ముందంజ

రంగంపేట: జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగులో రంగంపేట మండలం దూసుకుపోతోందని రుచిసోయా–పతంజలి ఆయిల్ పామ్ పరిశ్రమ డిప్యూటీ జనరల్ మేనేజర్ డి.రవీంద్ర అన్నారు. బుధవారం మండలంలోని మర్రిపూడిలో జరిగిన రైతు శిక్షణ శిబిరానికి ఆయన అధ్యక్షత వహించారు. జిల్లాలో ప్రస్తుతం రాజానగరం మండలం 7,800 ఎకరాలతో ప్రథమ, 7500 ఎకరాలతో రంగంపేట మండలం ద్వితీయ స్థానంలో ఉన్నాయన్నారు. మండల ఉద్యానవన అధికారి కె.దివ్యశ్రీ మాట్లాడుతూ గొట్టపు బావులున్న మెట్ట రైతులందరూ వరికి బదులుగా లాభసాటిగా ఉన్న ఆయిల్ పామ్ సాగుకు మళ్లాలన్నారు. ఆయిల్ పామ్ కంపెనీకి చెందిన శాస్త్రవేత్త, సీనియర్ మేనేజర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అధిక దిగుబడులు కోసం పలు సూచనలు చేశారు. రంగంపేట మండలంలో సగటు దిగుబడి ఆశాజనకంగా ఉందని, సరైన చర్యలు తీసుకోవడం ద్వారా ఎకరానికి 12 టన్నుల దిగుబడి సాధించవచ్చునన్నారు. రైతుల తరఫున అభ్యుదయ పామ్ ఆయిల్ సాగు రైతు పట్టా సోమన్న చౌదరి మాట్లాడుతూ టన్ను పామ్ గెలల ధర రూ. 23 వేల నుంచి రూ.13,700కు పడిపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. మర్రిపూడిలో 1500 ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలున్న కారణంగా గెలల సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పుట్టా సుబ్బారావు, పి.వీరభద్రరావు, ఎం.సత్తిరాజు విజ్ఞప్తి చేశారు.